# సాక్షి నిర్మల్

గురువారం • 21 • నవంబర్ • 2024






**విధులకు సమాయత్తం**

ఆదిలాబాద్ శిక్షణ కేంద్రంలో గురువారం పోలీస్ పాసింగ్ అవుట్‌పరేడ్ నిర్వహించను న్నారు. శిక్షణ కానిస్టేబుళ్లు విధులు నిర్వర్తిం చేందుకు సిద్ధమయ్యారు. 8లో▸



**బాలల హక్కుల దినోత్సవం**

జిల్లాలోని వివిధ పాఠశాలలో అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. 9లో▸

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం 19.1 /14.7

ఆకాశం నిర్మలంగా, ప్రకాశవంతంగా ఉం టుంది. రాత్రిపూట చలితీవ్రత పెరుగుతుంది. ఈదురుగాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### డీఈవో రామారావు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న డీఈవో రామారావు

నిర్మల్‌రూరల్: జిల్లా విద్యాశాఖ అధికారిగా పి.రామారావు బుధవారం బాధ్యతలు స్వీకరిం చారు. ప్రస్తుతం ఆయన భద్రాది కొత్తగూడెం జిల్లా విద్యాశాఖలో అడిషనల్ డైరెక్టర్‌గా పనిచే స్తుండగా ఎఫ్ఏసీ డీఈవోగా జిల్లాకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు జిల్లాలో డీఈవోగా పనిచేసిన రవీందర్‌రెడ్డి రిలీవ్ అయి ములుగు ఎఫ్ఏసీ డీఈవోగా బదిలీపై వెళ్లారు. నూతనం గా బాధ్యతలు స్వీకరించిన డీఈవోను కార్యా లయ సిబ్బంది, ఉపాధ్యాయ సంఘాల నాయ కులు సన్మానించారు. అనంతరం డీఈవో బాస రకు వెళ్లి జ్ఞాన సరస్వతీ అమ్మవారిని దర్శించు కున్నారు. ఆలయ సిబ్బంది పూలమాల, శాలు వాతో సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. బాసర బాలుర, బాలికల ఉన్న త పాఠశాలలు, ఉర్దూ మీడియం ఉన్నత పాఠ శాలలను తనిఖీ చేశారు. 'పది' విద్యార్థుల ప్రత్యేక తరగతులను పరిశీలించారు. ఆయన వెంట కార్యాలయ సిబ్బంది వెంకటరమణ, భోజన్న, భానుప్రసాద్, తదితరులు ఉన్నారు.

### షిరిడీ చేరుకున్న పాదయాత్ర



సాయిబాబా భక్తులతో జగన్మోహన్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గండి రామన్న క్షేత్రం నుంచి ఈ నెల 4న 20 మంది భక్తులు చేపట్టిన పాదయాత్ర బుధవారం షిరిడీ చేరు కుంది. భక్తులకు సాయి దీక్ష సేవాసమితి అధ్య క్షుడు లక్కడి జగన్మోహన్‌రెడ్డి ఘనస్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ 16 రోజులపాటు సాగిన పాద యాత్రలో సాయిబాబా కృపతో ఎలాంటి ఇబ్బ ంది కలుగలేదన్నారు. కార్యక్రమంలో సాయి భక్తులు రాజన్న, మహేందర్ యాదవ్, సతీష్, రాజు, శివ, సాయి, తదితరులు పాల్గొన్నారు.

# విద్యాశాఖ గాడినపడేనా..!?

- బాధ్యతలు చేపట్టిన కొత్త డీఈవో
- రామారావు ఎదుట సవాళ్లు ఎన్నో..
- లైవ్ లొకేషన్ అమలు చేస్తారా..
- సార్లను బడిబాట పట్టిస్తారా..
- సంఘాల నేతలకు కళ్లెం వేస్తారా..



డీఈవో రామారావుకు స్వాగతం పలుకుతున్న రవీందర్‌రెడ్డి, కార్యాలయ అధికారులు

నిర్మల్: కేవలం.. పదోతరగతి ఫలితాల్లో ఉత్తమం అనిపించుకున్న జిల్లా విద్యాశాఖ గత ఏడాదికాలం లో చాలా విషయాల్లో చెత్త రికార్డును మూటగట్టు కుంది. ఒక్క యూబిట్ వ్యవహారం చాలు.. జిల్లా విద్యాశాఖలో నిర్లక్ష్యం, నిర్లిప్తత ఏస్థాయిలో పేరుకు పోయాయో చెప్పడానికి. పది ఇరవై మంది కాదు.. ఏకంగా వందల్లో ఉపాధ్యాయులు కాసుల కక్కు ర్తిలో పడి బడిని, తరగతి గదిని, తమపైనే ఆశలు పెట్టుకున్న విద్యార్థులనీ గాలికొదిలేశారు. పాఠాలు చెప్పాల్సిన చోట.. సెల్‌ఫోన్లో 'కాయిన్'ల లెక్కలు వేసుకున్నారు. చివరకు కొందరు ఊచలను లెక్క పెట్టేదాకా వెళ్లారు. బడి ముఖం చూడకుండా రియ ల్‌ఎస్టేట్, ఫైనాన్స్ అంటూ తిరిగే సార్లూ చాలానే ఉన్నారు. ఇక కొంతమంది సంఘాల పేర్లు చెప్పు కునే ఉపాధ్యాయుల కథ వేరే ఉంది. ఏకంగా డీఈవోపైనే ఆజమాయిషీ చెలాయించే స్థాయికి వెళ్లిన సందర్భాలు విద్యాశాఖలో లెక్కలేనితనానికి తార్కాణంగా నిలిచాయి. ఇలా దారితప్పిన విద్యా శాఖను కొత్తగా బాధ్యతలు చేపట్టిన డీఈవో రామా రావు గాడిన పెడతారా..!? సర్కారు బడిని నమ్ము కున్న విద్యార్థులకు అండగా నిలుస్తారా..!? అని జిల్లావాసులు చర్చించుకుంటున్నారు.

**కరువైన పర్యవేక్షణ..**

ఒకప్పుడు డీఈవో తనిఖీకి వస్తున్నారని తెలియ గానే స్కూళ్లన్నీ అలర్ట్ అయ్యేవి. సార్లందరూ విద్యా ర్థులను ముందుగానే ప్రిపేర్ చేసేవారు. డీఈవోలు కూడా ఆకస్మికంగా తనిఖీలు చేస్తూ బడుల్లో అవస రాలే కాదు.. విద్యార్థుల పఠన నైపుణ్యాలనూ పరీక్షించేవారు. జిల్లా ఏర్పడినప్పటి నుంచీ ఇలాం టి సందర్భాలు చాలా తక్కువ. జిల్లా అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, తప్పులు చేసిన వారిపై చర్యలు తీసుకోకపోవడంతో చాలామంది ఉపాధ్యా యులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్న సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. రూ.లక్షల్లో వేతనాలు పొందుతున్నా.. కనీసం తమ వృత్తికి న్యాయం చేయని ఉపాధ్యాయులూ ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ఇప్పుడైనా డీఈవోగా బాధ్యతలు చేపట్టిన రామారావు గాడిన పెడతారని జిల్లా ఆశిస్తోంది.

**ఇష్టారీతిన సంఘాల నేతలు..**

పదేళ్లకాలంలో రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా జిల్లా విద్యాశాఖలో పలు సంఘాల పేర్లు చెప్పి కొంత మంది ఉపాధ్యాయులు వ్యవహరిస్తున్న తీరుపైనా ఆరోపణలు ఉన్నాయి. తమకు, తమవాళ్లకు నచ్చిన చోట పోస్టింగ్‌లు, డిప్యూటేషన్‌లను ఇప్పించుకోవ డంపైనా ఆరోపణలు వచ్చాయి. ఇలాంటి వాటిపై నా కొత్త డీఈవో దృష్టిపెట్టాల్సిన అవసరమూ ఉంది.

**'ప్రథమం' నిలుపాలి..**

జిల్లా రెండేళ్లుగా పదోతరగతి ఫలితాల్లో ప్రథమస్థా నంలో నిలుస్తూ రాష్ట్రస్థాయిలో సత్తా చాటుతోంది. ఈ ఏడాది కూడా అదేతీరులో ముందుకు సాగాల్సిన అవసరమూ ఉంది. వ్యవస్థలో ఎన్ని ప్రతికూలతలు ఉన్నాయో.. అంతకుమించి ఉత్తము లైన ఉపాధ్యాయులూ ఉన్నారు. చాలామంది విద్యా ర్థుల కోసం పనిచేస్తున్నవాళ్లూ ఉన్నారు. ఇలాంటి వారిని ప్రోత్సహించాలి. ప్రత్యేక తరగతులు, పర్య వేక్షణలతో జిల్లా పేరును నిలుపాల్సిన బాధ్యత కూడా కొత్త డీఈఓపైనే ఉంది.

**బడిపిల్లలకు న్యాయం చేద్దాం..**

జిల్లాలో చదువుకుంటున్న బడిపిల్లలందరి భవిష్యత్తు బాగుండేలా అందరం సమష్టి బాధ్యత తో పనిచేద్దాం. కొత్తగా బాధ్యతలు చేపట్టా. ముం దు జిల్లాపై అవగాహన పెంచుకుని, విద్యావ్యవ స్థను మెరుగుపర్చేందుకు కృషి చేస్తా.

– పి.రామారావు, డీఈవో

**యూబిట్ కేసుల్లో 'స్టార్లు'..**

రాష్ట్రంలోనే సంచలనంగా మారి, ప్రస్తుతం ఈడీ దృష్టిలో ఉన్న యూబిట్ కేసులో జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు వందల్లో ఉండటం తెలిసిందే. ఇప్పటికీ కొంతమంది 'స్టార్లు' తెరవెనుక ఈ దందాను కొనసాగిస్తు న్నట్లు ఆరోపణలు ఉన్నాయి. క్లాసురూము ల్లోనే 'కాయిన్'ల దందాలు చేస్తూ.. కళ్లముం దున్న పిల్లలకు ద్రోహం చేస్తున్న ఇలాంటి 'స్టార్ల'నూ గాడిన పెట్టాల్సిన అవసరముంది.

**'లైవ్ లొకేషన్' ఎక్కడా..!?**

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడిప్పుడే ఉపాధ్యాయుల హాజరుపై దృష్టి పెడుతోంది. తాజాగా మంగళ వారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బయోమెట్రిక్ ద్వారా ఉపాధ్యాయుల హాజరు తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. కానీ జిల్లాలో ఎప్పటి నుంచో ఏకంగా లైవ్‌లొకేషన్ విధానం అమలులో ఉంది. నాలుగేళ్ల క్రితమే సర్కారు బడిని గాడిన పెట్టడానికి అప్పటి కలె క్టర్ ముషరఫ్‌అలీ ఈ వ్యవస్థను ఏర్పాటు చేశారు. తర్వాత వచ్చిన కలెక్టర్లు వరుణ్‌రెడ్డి, ఆశిష్‌సంగ్వాన్ దీన్ని కొనసాగించారు. లైవ్‌లొకే షన్ పెట్టుకున్నా.. ఇతరులతో పెట్టించినా.. వాళ్లు చర్యలు తీసుకున్నారు. ఈక్రమంలో ఉపా ధ్యాయుల హాజరు శాతం పెరగడంతో పాటు పక్కాగా బడి వేళలను పాటించారు. కానీ కొం తకాలంగా 'లైవ్ లొకేషన్' వ్యవస్థనే నీరుగారు స్తూ వస్తున్నారు. గత డీఈవో కూడా దీనిపై సీరియస్‌గా దృష్టిపెట్టిన దాఖలాలు లేవు. ప్రస్తుత కలెక్టర్ కూడా ఈ విధానంపై చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు దారితీస్తోంది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ హాజరుకు మొగ్గుచూపుతున్న నేపథ్యంలో జిల్లాలో ఇప్ప టికే ఉన్న 'లైవ్‌లొకేషన్' విధానాన్ని మరింత పక్కాగా అమలు చేయాల్సిన బాధ్యత కొత్త డీఈవోపైనే ఉంది.

# గ్రంథాలయాలు సద్వినియోగం చేసుకోవాలి



బహుమతులు సాధించిన విద్యార్థులు

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్‌ఖిల్లాగుట్ట: గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. బుధవారం 57వ గ్రం థాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ అర్జుమంద్ అలీతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సంద ర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు పట్టుదల తో చదివి కొలువులు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఇందుకు అవసర మైన అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచామన్నారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ అర్జు మంద్ అలీ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న సృ జనాత్మకతను వెలికి తీసేందుకే పోటీలు నిర్వ హించామన్నారు. జిల్లా గ్రంథాలయంలో పుస్త కాలకు కోడింగ్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిం దన్నారు. అనంతరం ఇటీవల వివిధ కేటగిరీల లో నిర్వహించిన పోటీలలో విజేతలకు బహు మతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నాందేడపు చిన్ను, సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ అది, లైబ్రేరియన్ రాథోడ్ మోహన్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

**ఔదార్యం చాటుకున్న చైర్మన్**

నిర్మల్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సయ్యద్ అర్జు మంద్ అలీ తన ఔదార్యం చాటుకున్నారు. కేం ద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమ వుతున్న అభ్యర్థులు మధ్యాహ్న భోజన సమ యంలో ఇంటికి వెళ్లి తిని వచ్చేందుకు సమయం వృథా అవుతోంది. దీనిని గుర్తించిన ఆయన వా రికి వెన్నుదన్నుగా నిలవాలని నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం నిర్వహించిన వారోత్స వాల ముగింపు సందర్భంగా మధ్యాహ్న భోజ నాన్ని ప్రారంభించారు. పోటీ పరీక్షలు పూర్త య్యేంత వరకు సుమారు మూడు నెలలపాటు కార్యక్రమాన్ని కొనసాగిస్తానన్నారు.

# మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలి

- ఎస్పీ జానకీ షర్మిల



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్‌టౌన్: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ జానకీ షర్మిల అన్నారు. బుధ వారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో షీ టీం, భరోసా సిబ్బందితో కలిసి లైంగిక వేధింపు లు, ఉమెన్ సేఫ్టీ అండ్ సెక్యూరిటీ, పోక్సో చట్టాలు, మానవ అక్రమ రవాణాకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లా డుతూ మహిళలు, విద్యార్థుల భద్రత, రక్షణ కొరకు షీ టీం బృందాలు పనిచేస్తున్నాయన్నారు. ఆక తాయిలు వేధింపులకు గురిచేసినా మానసికంగా, శారీరకంగా హింసించినా, సోషల్ మీడియా ద్వారా వేధించినా వెంటనే పోలీసులకు సమాచారం అం దించాలన్నారు. మైనర్ అయితే కౌన్సిలింగ్, మేజర్ అయితే కేసులు నమోదు చేస్తామన్నారు. విద్యార్థు లు అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాల న్నారు. కొత్త వ్యక్తులు చెప్పే మాయమాటలకు మోసపోవద్దని సూచించారు. బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా లాంటివి మీ దృష్టికి వస్తే డయల్ 100 లేదా 1098 లేదా షీ టీం 8712659550 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఐ వినోద్, షీ టీం భరోసా మహిళా ఎస్సై సుమంజలి, సిబ్బంది పాల్గొన్నారు.

### 'సీఎం పదవిని కాపాడుకోవడానికే విమర్శలు'

నిర్మల్‌ఖిల్లాగుట్ట: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన పద విని కాపాడుకోవడానికి ప్రధాని నరేంద్ర మోదీని, బీజేపీని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఆపార్టీ సీనియర్ నాయకుడు రావుల రాంనాథ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి తన హోదాను మరిచి మాట్లాడుతు న్నారన్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి నరేంద్ర మోదీకి, గుజరాత్‌కు గులాంగిరి చేస్తున్నాడని వ్యాఖ్యానించడం ఆయన అవివేకానికి నిదర్శనమ న్నారు. సోనియాగాంధీకి గులాంగిరి చేస్తున్న మీరు ఇటలీకి గులాంగిరివి కావా అని ప్రశ్నించారు. ఏడాది కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం సాధించింది ఏమిటో ప్రజలకు వివరించాలన్నారు. ఆరు గ్యారెం టీలు, 240 హామీలు వెంటనే అమలు చేయాలని లేనిపక్షంలో ప్రజలు క్షమించరన్నారు.

### పీజీ కాలేజీని కాపాడాలని గవర్నర్‌కు ఫిర్యాదు

నిర్మల్: కాలేజీలో చేరేందుకు ఆసక్తి గల విద్యార్థులు ఉన్నా.. జిల్లా కేంద్రంలోని కాకతీయ యూనివర్సిటీ పీజీ కాలేజీని కనుమరుగు చేసే ప్రయత్నం చేస్తు న్నారని జ్ఞానసరస్వతీ యూనివర్సిటీ సాధన సమితి అధ్యక్షుడు నంగె శ్రీనివాస్ ఆరోపించారు. ఈ మేరకు మెయిల్ ద్వారా యూనివర్సిటీల చాన్స్ లరైన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు ఫిర్యాదు చేశారు. జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాల విద్యార్థులు పోస్టు గ్రాడ్యుయేషన్ చదివేందుకు ఉపయోగపడా ల్సిన కాలేజీ భవనాన్ని నర్సింగ్ కళాశాలకు కేటాయించడం దారుణమన్నారు. జిల్లా విద్యార్థు లకు ఉన్నత విద్యను అందించాల్సిన అధికారులే ఇలా తప్పుదోవ పట్టించడం సరికాదని, పీజీ కాలే జీని పునరుద్ధరించాలని ఫిర్యాదులో కోరినట్లు శ్రీనివాస్ పేర్కొన్నారు.

### అర్చరీ పోటీల్లో ప్రతిభ



కోచ్ జగాదిరావుతో జగన్

కడెం: గుజరాత్ రాష్ట్రంలోని నడియార్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19, 20 తేదీల్లో నిర్వహించిన జాతీయస్థాయి అర్చరీ పోటీల్లో జిల్లా విద్యార్థి ప్రతిభ కన బరిచాడు. అండర్–14 విభాగంలో మండలం లోని అల్లంపల్లి జీయర్ గురుకులం విద్యార్థి తుమ్రం జగన్ పాల్గొని ద్వితీయస్థానం సాధిం చి సిల్వర్ మెడల్ అందుకున్నట్లు పాఠశాల హెచ్ఎం ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. సదరు విద్యార్థిని జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ (జెట్)చై ర్మన్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినం దించారు.

# ఆర్గానిక్ పత్తి.. విదేశాలకు ఎగుమతి



జన్నారంలోని హరిత రిసార్ట్స్‌లో విదేశీయులు

- ప్రతియేటా ఉమ్మడి జిల్లా నుంచి తరలింపు
- చెన్నయ్ మీదుగా జర్మనీకి.. బట్టలకు వినియోగం
- క్వింటాల్‌కు రూ.500 అదనం

జన్నారం: పత్తి పంట చేతికి రావాలంటే రసాయన ఎరువులు వాడాల్సిందే. మొలక నుంచి మొదలు పత్తి పంట చేతికొచ్చే వరకు చీడపీడల నుంచి రక్ష ణకు రైతులు వేల రూపాయలు ఖర్చు చేసి రసా యన మందులు పిచికారీ చేస్తారు. ఈ పద్ధతికి స్వస్తి పలికి ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల రైతులు పూర్తిగా సేంద్రియ ఎరువులతో పత్తి పండిస్తు న్నారు. దిగుబడి వచ్చిన పత్తిని విదేశాలకు ఎగు మతి చేస్తున్నారు. చేత్నా ఆర్గానిక్ అగ్రికల్చర్ ప్రొ డ్యూసర్ సంస్థ రైతులు, జర్మనీలోని డిబెల్ల టెక్స్ టైల్ కంపెనీ ప్రతినిధులకు మధ్య వారధిగా నిలుస్తోంది. గత ఎనిమిదేళ్లుగా ఉమ్మడి జిల్లాలోని ఆరు మండలాల్లో సుమారు 5,500మందికి పైగా రైతులు ఆర్గానిక్ పత్తి పంట పండిస్తున్నారని చేత్నా ఆర్గానిక్ అగ్రికల్చర్ ప్రొడ్యూసర్ సంస్థ సీఈవో నం దకుమార్ తెలిపారు.

**సేవా కార్యక్రమాలు**

జర్మనీ, నెదర్లాండ్ దేశాలకు చెందిన ప్రతినిధులు రైతులతో ఆర్గానిక్ పంట పండించడమే కాకుండా వారి కోసం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. సిర్పూర్ మండలంలో కంప్యూటర్ ల్యాబ్, సిర్పూర్ -యూ మండలం రాఘవాపూర్‌లో విద్యార్థుల కోసం ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేశారు.

**జన్నారం మండలంలో ప్రోత్సాహం**

రైతులు ముందుకు వస్తే జన్నారం మండలంలో కూడా ఆర్గానిక్ పత్తి పంట పండించేందుకు ప్రోత్సా హం అందిస్తామని తెలిపారు.

ఈ మండలంలోని గిరిజన గ్రామాలను ఎంచుకుని ఆర్గానిక్ పంటపై అవగాహన కల్పించి రైతులు ముందుకు వస్తే వచ్చే ఏడాది ప్రారంభిస్తామని ప్రతినిధులు పేర్కొన్నారు.

**చెన్నయ్ మీదుగా జర్మనీకి సరఫరా..**

పత్తి పంట చేతికి వచ్చాక పత్తిని తీసే విధానంపై అవగాహన కల్పించడానికి జర్మనీ దేశస్తులు ప్రతీ సంవత్సరం ఇక్క డికి వస్తుంటారు. పత్తిని తీశాక ఇంద్రవె ల్లి మండలంలో జిన్నింగ్ చేసి అక్కడి నుంచి చెన్నయ్‌కు తీసుకెళ్తారు. అక్కడి నుంచి సదస్ ఫాస్ట్ ఇండియా కంపెనీ నుంచి జర్మనీ దేశానికి తరలిస్తారు. ఈ పత్తితో జర్మనీలో టవల్స్, బెడ్‌షీట్లు తయారు చేసి విక్రయిస్తారు. ప్రతీ సంవ త్సరం పత్తి పండించి ఎగుమతి చేస్తుండ గా.. ఏటేటా రైతుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ముందుగా 800 మందితో పం ట పండించగా.. ప్రస్తుతం ఆ రైతులు సంఖ్య 5,500మందికి చేరింది.

**అ'ధనం'**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నార్నూర్, కెర మెరి, ఆసిఫాబాద్, సిర్పూర్-యూ, జైనూర్, ఉట్నూర్ మండలాల్లోని 170 గ్రామాల్లో ఆర్గా నిక్ పత్తి పంట పండిస్తున్నారు. ఈ ఏడాది ఆయా గ్రామాల్లోని 5,500 మంది రైతులు 7,900 ఎకరాల్లో పత్తి సాగు చేసి 55,300 క్విం టాళ్ల దిగుబడి సాధించారు. ఈ పత్తికి మార్కెట్ ధర కన్న పది శాతం ఎక్కువ ధర చెల్లిస్తారు. ఆర్గానిక్ పద్ధతిలో పంట దిగుబడి తగ్గే అవకాశం ఉందని గ్రహించి ఈ ధర చెల్లిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో పత్తి ధర క్వింటాల్‌కు రూ.7,500 ఉండగా.. సంస్థ రూ.8వేలు చెల్లిస్తోంది. దీంతోపాటు రైతులకు పంటలపై అవగాహన కల్పిస్తూ వారికి అవస రమైన సేంద్రియ ఎరువులకు సహకారం అం దిస్తున్నారు.

**రైతులతో కలిసి పోతున్నాం**



ప్రతీ సంవత్సరం పత్తి పంటను పరిశీలించేందుకు ఇక్కడికి వస్తుంటాం. ఇది రెండోసారి రావడం. గ్రామానికి వెళితే గ్రామస్తులు మమ్ములను గౌరవం గా చూసుకుంటున్నారు. వారితో కలిసి పత్తి చేలకు వెళ్తాం. వారితో కలిసిపోతు న్నాం.

– మిచీల్ ఎలెన్‌కాంప్, నెదర్లాండ్

**ఇష్టంగా కొంటారు..**



జర్మనీ దేశంలో ఆర్గానిక్ పత్తితో చేసిన బట్టను ఇష్టంగా కొంటారు. అం దుకే ఈ ప్రాంతంలో రైతు లకు అవగాహన కల్పించి శిక్షణ ఇచ్చాం. రైతులు ముందుకు వచ్చి ఆర్గానిక్ పత్తి పండిస్తున్నారు. ఈ ప్రాంతంలో మరింత ఆర్గానిక్ పత్తి సాగు అయ్యేలా చూస్తున్నాం. రైతులకు లాభం కూడా జరుగుతుంది.

– రాల్ఫ్ హెల్మన్, డిబెల్ల కంపెనీ ప్రతినిధి, జర్మనీ

**చెన్నయ్ నుంచి తరలిస్తాం**



ముందుగా ఇక్కడి నుంచి పత్తిని ఏరి జిన్నింగ్ చేయిస్తాం. జిన్నిం గ్ అయిన తర్వాత చెన్నయ్‌లోని కంపెనీకి తరలిస్తాం. అక్కడ బట్ట తయారు చేసి బట్టను జర్మ నీకి పంపుతాము. జర్మనీలో కం పెనీ ద్వారా టవల్స్, బెడ్ షీట్స్, కాటన్ వంటివి తయారు చేసి విక్రయిస్తారు. జర్మనీ ప్రజలు ఆర్గా నిక్ పత్తితో తయారు చేసిన వాటిని ఇష్టపడుతారు.

– రంగరాజన్, సదస్‌ఫాస్ట్ ఇండియా అధికారి, చెన్నయ్

## క్లుప్తంగా

### టిప్పర్ బోల్తాపడి డ్రైవర్‌కు గాయాలు



గాంధీనగర్ వద్ద బోల్తా పడ్డ టిప్పర్

ఇచ్చోడ: గుడిహత్నూర్ మండలంలోని సోమా కంపెనీ నుంచి ఇచ్చోడ మండల కేంద్రానికి తారు లోడ్‌తో వస్తున్న టిప్పర్ బుధవారం అదుపు తప్పి గాంధీనగర్ వద్ద జాతీయ రహదారిపై బోల్తా పడినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. క్యాబిన్‌లో ఇరుక్కుపోయి గాయపడిన డ్రైవర్ దినేశ్‌ను జేసీబీ సాయంలో బయటకు తీసి 108లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### కారు ఢీకొని ఒకరి మృతి



మల్లేశ్ మృతదేహం

భీమారం: మండల కేంద్రంలోని ఇప్పలబొగుడ వద్ద జాతీయ రహదారిపై బుధవారం జరిగిన ప్రమాదంలో ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు డ్రైవర్ మృతిచెందాడు. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. భీమారం నుంచి మంచిర్యాల వైపు మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న జైపూర్ మండలం రసూల్‌పల్లి గ్రామానికి చెందిన ఆకుదారి మల్లేశ్(28)ను వెనుక నుంచి కారు అతి వేగంగా ఢీకొట్టింది. దీంతో కిందపడి తీవ్రంగా గాయపడిన మల్లేశ్‌ను 108అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. కారు డ్రైవర్ పారిపోయాడని ఏసీపీ తెలిపారు. సంఘటన స్థలాన్ని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరుపై తెలుసుకున్నారు.

### 24న ఉమ్మడి జిల్లాస్థాయి చెస్‌పోటీలు

రెబ్బెన(ఆసిఫాబాద్): జిల్లా కేంద్రంలోని బాలికల ఆదర్శ క్రీడాపాఠశాలలో ఈ నెల 24న ఉమ్మడి జిల్లాస్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సంపత్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఉపేందర్, టోర్నమెంట్ కన్వీనర్ రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 9, 11, 13, 14, 15 విభాగాల్లో ఓపెన్ టూ ఆల్ పద్ధతిలో ఈ పోటీలు కొనసాగుతాయన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు ఉచిత భోజన సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు చీఫ్ ఆర్బిటర్ అంబాల కల్పన, ఎం.శృతిలను 8978146456 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

### రాజకీయాలకు అతీతంగా పనిచేయాలి



మాట్లాడుతున్న తుడుం దెబ్బ రాష్ట్ర కన్వీనర్ బుర్స పోచయ్య

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీ హక్కుల సాధనకు రాజకీయాలకు అతీతంగా పనిచేయాలని తుడుం దెబ్బ రాష్ట్ర కన్వీనర్ బుర్స పోచయ్య పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో నిర్వహించిన తుడుం దెబ్బ జిల్లా మహాసభలకు నిర్మల్, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాల తుడుం దెబ్బ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా పోచయ్య మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతాలకు వలసవాదులు వచ్చి గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని లబ్ధి పొందడంతో పాటు అన్ని రకాలుగా వంచిస్తున్నారని ఆరోపించారు. అలాంటి వారిపై ఆదివాసీ హక్కుల పోరాట సమితి పోరు ప్రారంభించిందని చెప్పారు. అనంతరం తుడుం దెబ్బ మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లా కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నిర్మల్ జిల్లా కమిటీని ఈ నెల 23న ఖానాపూర్‌లో జిల్లా సమావేశం నిర్వహించి ఎన్నుకోనున్నట్లు తెలిపారు. నాయకులు గోడం గణేశ్, పుర్కబాపురావు, గోడం నగేశ్, కుడిమెత తిరుపతి, గుర్రాల రవీందర్, పంద్ర జైవంత్‌రావు, కోట్నాక్ విజయ్, ఆత్రం ఆనంద్‌రావు, పెందూర్ పుష్పరాణి, రేణు కాబాయి, ఆత్రం మోతీరాం, సిడాం సోనేరావ్, బాజీరావు తదితరులున్నారు.

# శిక్షణ సమాప్తం.. విధులకు సమాయత్తం

- నేడు పోలీస్ పాసింగ్ అవుట్‌పరేడ్
- ముఖ్యఅతిథిగా రానున్న ఐజీ రమేశ్
- సొంతజిల్లాలకు వెళ్లనున్న 254 మంది
- జిల్లాకు 219మంది కొత్త పోలీసులు



ముస్తాబైన పరేడ్ మైదానం



ఫైరింగ్‌లో సూచనలిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం(ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: శారీరక దారుఢ్య, రాత పరీక్షల్లో విజయం సాధించిన పలువురు కానిస్టేబుల్ కొలువు సాధించారు. గత ఫిబ్రవరి 21న జిల్లా కేంద్రంలోని పోలీస్ శిక్షణ కేంద్రంలో తొమ్మిది నెలల పాటు ట్రైనింగ్ పొందారు. ఇందులో రాష్ట్రంలోని సూర్యాపేట, సంగారెడ్డి, సిరిసిల్ల, జగిత్యాల, సైబరాబాద్, ములుగు జిల్లాలకు చెందిన 254 మంది ఉన్నారు. వీరి పోలీస్ పాసింగ్ అవుట్‌పరేడ్ గురువారం నిర్వహించనుండగా ఈ సందర్భంగా వీరు నేర్చుకున్న అంశాలను ప్రదర్శించనున్నారు. కార్యక్రమానికి ఐజీ ఎం.రమేశ్ ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు. కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలం, తెలంగాణ బెటాలియన్ కమాండెంట్ నితికపంత్‌తో కలిసి శిక్షణలో ప్రతిభ చాటిన అభ్యర్థులకు మెడల్స్ బహూకరించనున్నారు. ఆ తర్వాత వీరంతా ఆయా జిల్లాల్లో ఎస్పీకి రిపోర్ట్ చేసి విధుల్లో చేరనున్నారు.

**జిల్లాకు 219 మంది కొత్త పోలీసులు**

ఆదిలాబాద్ జిల్లాలో కొత్త పోలీసులుగా విధుల్లో చేరనున్నవారిలో పురుషులు జడ్చర్ల, యూసుఫ్‌గూడ, మహిళలు హైదరాబాద్‌లోని పోలీస్ ట్రైనింగ్ సెంటర్లలో శిక్షణ పొందారు. జిల్లాకు 219 మంది రానుండగా, వీరిలో 94 మంది పురుషులు సివిల్, 46 మంది మహిళలు సివిల్ కానిస్టేబుళ్లున్నారు. 63 మంది పురుషులు ఏఆర్, 16 మంది మహిళలు ఏఆర్ కానిస్టేబుళ్లు రానున్నారు. వీరితో పాటు 16మంది అగ్నిమాపక శాఖ, ఎక్సైజ్ కానిస్టేబుళ్లు కూడా విధుల్లో చేరనున్నారు. ఎస్పీ వీరికి పోస్టింగ్ కల్పించనున్నారు. కాగా, జిల్లాలో శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో కొందరి అభిప్రాయాలు వారి మాటల్లోనే..

### బెస్ట్ ఫైరర్‌గా ఎంపికయ్యాను



నేను రెండో ప్రయత్నంలో కొలువు సాధించాను. మానసికంగా, శారీరకంగా దృఢత్వాన్ని పెంచుకున్నాను. ఎస్సై ఉద్యోగం కొద్దిలో మిస్సయింది. కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాను. జిల్లా కేంద్రంలోని డీటీసీలో శిక్షణ పొందిన నేను బెస్ట్ ఫైరర్‌గా ఎంపికయ్యాను.
– ఎండీ యూనుస్, జగిత్యాల

### చాలా సంతోషంగా ఉంది



మా మేనమామ పోలీస్‌శాఖలో పనిచేస్తున్నాడు. ఆయన ప్రోత్సాహంతో డిపార్ట్‌మెంట్‌పై మక్కువ పెంచుకున్నాను. రెండేళ్లు కష్టపడి కొలువు సాధించాను. శిక్షణ సమయంలో బాగా చూసుకున్నారు. విధుల్లో చేరబోతుండడం చాలా సంతోషంగా ఉంది.
– రాజేశ్, సూర్యాపేట

### బెటాలియన్ కానిస్టేబుల్ వదిలి..



2018లో బెటాలియన్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాను. యూసుఫ్‌గూడలో రెండేళ్లు విధులు నిర్వర్తించాను. ఎస్సై ఉద్యోగం కొద్దిలో మిస్సైంది. ఆ తర్వాత కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాను. తొమ్మిది నెలలు శిక్షణ పొందాను. అన్ని విభాగాల్లో ఆల్‌రౌండర్‌గా రెండో స్థానం సాధించాను. – జీ వినోద్‌కుమార్, సూర్యాపేట

### మొదట్లో ఇబ్బందిపడ్డా..



కానిస్టేబుల్‌గా ఎంపికైన తర్వాత శిక్షణ కఠినంగా ఉంటుందని భయపడ్డాను. నెల వరకు కష్టంగానే అనిపించింది. ఇక్కడ క్రమశిక్షణతోపాటు అన్ని అంశాల్లో శిక్షణ పొందాను. సొంత పిల్లల్లాగా భావించి ఆర్ఎస్సైలు గోపి, రాకేశ్ శిక్షణ ఇచ్చారు. డ్యూటీలో ఎలా రాణించాలో చెప్పారు. – సాయి ఫణీంద్ర, సైబరాబాద్

### అమ్మ ప్రోత్సాహంతోనే..



నేను పదో తరగతిలో ఉండగా నాన్న మృతిచెందాడు. మా ముగ్గురి అన్నదమ్ములను అమ్మ కష్టపడి చదివించింది. పెద్దన్న కానిస్టేబుల్‌గా, రెండో అన్న మెట్రో వాటర్‌బోర్డులో ఉద్యోగం చేస్తున్నారు. నేను కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాను. అమ్మ కలను సాకారం చేశాను. – రమేశ్, సంగారెడ్డి

### వందశాతం ఉత్తీర్ణులయ్యారు



ఆరు జిల్లాలకు చెందిన 254 మందికి శిక్షణ ఇచ్చాం. అన్ని అంశాల్లో రాణించేలా చూశాం. పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణులయ్యారు. ఎన్నికల విధులు, వినాయక నిమజ్జనం సమయంలో బందోబస్తు విధులు కేటాయించాం. గురువారం వీరు సొంత జిల్లాలకు వెళ్లనున్నారు.– సీ సమయ్‌జాన్‌రావు, ప్రిన్సిపాల్, డీటీసీ

### బూర్గుడ హెచ్‌ఎంపై విచారణ



ఫిర్యాదు చేస్తున్న ఉపాధ్యాయులు

ఆసిఫాబాద్: మండలంలోని బూర్గుడ హెచ్‌ఎం శ్యాంసుందర్‌పై బుధవారం శాఖాపరమైన విచారణ చేపట్టారు. టీయూటీఎఫ్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో వరంగల్ ఆర్‌జేడీకి ఫిర్యాదు చేయగా.. ఏడీ గమానియల్ పాఠశాలలో విచారణ చేపట్టారు. జూన్‌లో నిర్వహించిన పదోతరగతి అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో విధులు నిర్వర్తించిన ఇన్విజిలేటర్లకు డ్యూటీ సర్టిఫికెట్ ఇవ్వకుండా వేధించడం, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పతాకావిష్కరణకు గైర్హాజరవడం, స్కూల్ అసిస్టెంట్ పెండ్యాల సదాశివ్‌కు సీసీఎల్‌ఎఫ్ మంజూరు చేయకపోవడంతోపాటు పలు అంశాల్లో నిబంధనలు అతిక్రమించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాగే పలువురు ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో ఫిర్యాదు చేశారు.

### ఆర్టీసీ కార్గో హోమ్ డెలివరీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్టీసీ కార్గో సిబ్బంది

నిర్మల్‌టౌన్: సరుకు రవాణాలోనూ ఆర్టీసీ తన వాటా పెంచుకోవాలని ప్రయత్నిస్తోంది. ఖర్చులకు తగినట్లు అదనపు ఆదాయ మార్గాలను అన్వేషిస్తోంది. విస్తృత నెట్‌వర్క్ కలిగిన ఆర్టీసీ ఇప్పటికే కార్గో సేవల ద్వారా మంచి ఆదాయం పొందుతోంది. ఆ రంగంలోని అపార అవకాశాలను అందిపుచ్చుకునేందుకు హోమ్ డెలివరీకి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని వివేక్‌నగర్, గంగా కాంప్లెక్స్, నారాయణరెడ్డి మార్కెట్ ప్రాంతంలోని ప్రజలకు ఆదిలాబాద్ రీజియన్ కార్గో మేనేజర్ బి.పాల్ ఆధ్వర్యంలో హోమ్ డెలివరీ సేవలపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు.

## కారు అద్దం పగులగొట్టి నగదు చోరీ

- రూ.1.80 లక్షలు అపహరణ
- నిర్మల్ జిల్లా భైంసాలో ఘటన



నగదు ఎత్తుకెళ్లింది ఈ కారులో నుంచే..

భైంసాటౌన్(ముథోల్): భైంసా పట్టణం నడిబొడ్డున నిలిపి ఉంచిన ఓ కారులో నుంచి నగదు ఎత్తుకెళ్లిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. లోకేశ్వరం మండలంలోని గడ్చాందకు చెందిన బీడీ కంపెనీ నిర్వాహకుడు అల్లం భోజన్న రూ.50వేల నగదుతో కారులో భైంసాకు వచ్చాడు. ముందుగా నిర్మల్ రోడ్‌లోని ఎస్‌బీఐలో మరో రూ.90వేల నగదు డ్రా చేసుకున్నాడు. అక్కడి నుంచి బస్టాండ్ పక్కన గల ఎస్‌బీఐ వద్దకు వెళ్లాడు. అక్కడ కారులో నగదు ఉన్న బ్యాగును ఉంచి పని నిమిత్తం బ్యాంక్‌లోపలికి వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత వచ్చి చూడగా కారు అద్దం పగులగొట్టి ఉంది. అందులో నగదు బ్యాగ్ కనిపించలేదు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై ఎండీ గౌసుద్దీన్ వచ్చి వివరాలు సేకరించారు. సీసీ ఫుటేజీలు పరిశీలించగా రెండు బైక్‌లపై వచ్చిన నలుగురు దుండగులు నగదు చోరీ చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు నిందితుల కోసం గాలిస్తున్నారు.

## టాటా ఏస్ వాహనానికి అగ్ని ప్రమాదం



ప్రమాదంలో కాలుతున్న వాహనం

జైపూర్: మండలంలోని ఇందారం క్రాస్ రోడ్డు సమీపంలో ఉన్న శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద జాతీయ రహదారిపై ప్రయాణికులతో వెళ్తున్న టాటా ఏస్ వాహనం బుధవారం అగ్నిప్రమాదానికి గురైంది. ప్రయాణికులు సురక్షితంగా బయపడడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మంచిర్యాల నుంచి చెన్నూర్ వైపు ప్రయాణికులతో వెళ్తున్న టాటా ఏసీ వాహనంలో ఒక్కసారిగా పొగలు రావడాన్ని గమనించిన డ్రైవర్ వాహనాన్ని పక్కన నిలిపాడు. ప్రయాణికులను కిందికి దింపేలోగానే మంటలు ఒక్కసారిగా చెలరేగాయి. వాహనం మొత్తం అంటుకోగా ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడడంతో కొద్ది క్షణాల్లోనే వాహనం కాలిబూడిదైంది. అటు వైపున వెళ్తున్న వాహనదారులు అంతా భయాందోళనకు గురయ్యారు.

## మంత్రుల పర్యటన భద్రత ఏర్పాట్ల పరిశీలన



భద్రతపై సూచనలు చేస్తున్న సీపీ శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: మంచిర్యాలలో గురువారం సూపర్ స్పెషాలిటీ, మాతాశిశు ఆసుపత్రి భవన నిర్మాణ భూమి పూజకు రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో భద్రత ఏర్పాట్లను రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాసులు బుధవారం పరిశీలించారు. హెలిప్యాడ్, భూమి పూజ జరిగే ప్రాంతం, బహిరంగ సభ వేదిక సందర్శించారు. రూట్‌మ్యాప్ పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్, అడిషనల్ డీసీపీ రాజు, ఏసీపీ ఆర్ ప్రకాష్, సీఐ ప్రమోద్‌రావ్ పాల్గొన్నారు.

## బాసర గోదావరినదికి హారతి



హారతిస్తున్న ఆలయ అర్చకులు

బాసర: బాసర గోదావరినదీ తీరం వద్ద బుధవారం సాయంత్రం దేవస్థానం ఆధ్వర్యంలో ఆలయ వైదిక బృందం సభ్యులచే గోదావరి హారతి కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ముందుగా వేద మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు చేసి గోదావరినదికి పంచహారతి ఇచ్చారు. ఇట్టి విశేష పూజా కార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

### యువకుడి ఆత్మహత్యాయత్నం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పంజాబ్‌చౌక్ సమీపంలోగల లాడ్జిలో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. తాంసి మండలంలోని ఓ గ్రామానికి చెందిన సదరు యువకుడు వివాహితతో కలిసి లాడ్జికి వెళ్లాడు. వారి మధ్య వివాదం తలెత్తగా యువకుడు లాడ్జిలోని ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నట్లు సమాచారం. దీంతో సదరు మహిళ లాడ్జి సిబ్బందికి సమాచారమిచ్చింది. వారు అతడిని రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఈ విషయమై టూటౌన్ సీఐ కరుణాకర్ రావును సంప్రదించగా తమకెలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

### పోక్సో కేసులో ఒకరి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: బాలికను కిడ్నాప్ చేసిన కేసులో పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన మహ్మద్ సమీర్ అనే యువకుడిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. ప్రేమ పేరిట నమ్మించిన సమీర్ బాలికను ఇంటి నుంచి తీసుకెళ్లగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. సమీర్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి

- 2027 ఏప్రిల్ 21 నుంచి సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు
- బీజేపీ నేతలది అవగాహనరాహిత్యం
- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలక్రైం: మంచిర్యాల నియోజకవర్గాన్ని మోడల్ సిటీగా విద్య, వైద్య రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నానని, జిల్లాలో 2027 ఏప్రిల్ 21 నుంచి సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందించనున్నామని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ప్రకటించారు. జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో సూపర్ స్పెషలిటీ ఆసుపత్రి, మాతాశిశు ఆసుపత్రి భవన నిర్మాణానికి ఈ నెల 21న భూమి పూజ సందర్భంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భూమి పూజకు రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క హాజరవుతారని అన్నారు. ఆసుపత్రి నిర్మాణంపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌రావు అవగాహనరాహిత్యంతో మాట్లాడుతున్నారని, సూపర్ స్పెషలిటీ ఆసుపత్రికి అనుమతి లేదని, మాతాశిశు ఆసుపత్రికి మాత్రమే అనుమతి ఉన్నాయని మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. 650 పడకలతో ప్రారంభం కానున్న సూపర్ స్పెషలిటీ ఆసుపత్రిని భవిష్యత్‌లో 1200 పడకల స్థాయికి తీసుకెళ్తానని అన్నారు. ఆసుపత్రి నిర్మాణానికి రూ.350 కోట్లు అవసరం కాగా మొదటిసారి బడ్జెట్‌లో రూ.50కోట్లకు ఆమోదం తెలిపారని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### టీపీఏ జిల్లా కమిటీ ఎన్నిక

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్(టీపీఏ) జిల్లా నూతన కమిటీని బుధవారం మంచిర్యాలలో ఎన్నుకున్నారు. ఎన్నికల పర్యవేక్షకుడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణరావు కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా రంగు వేణుకుమార్, ప్రధాన కార్యదర్శిగా సుమన చైతన్య, ఉపాధ్యక్షులుగా మొగిలి, రజిత, కోశాధికారిగా సమ్మయ్య, సంయుక్త కార్యదర్శులుగా సృజన మోహన, శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులుగా కిరణ్‌కుమార్, నాగరాజ్, ప్రశాంతి, కవిత, గౌరవ సలహాదారులుగా పద్మచరణ్, యోగేశ్వర్, చంద్రమోహన్‌గౌడ్ ఎన్నికయ్యారు. వెంకటేశ్వర్లు, శశికిరణ్ న్నారు.

## మత్తుకు బానిసైతే జీవితం చిత్తే



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సాప పండరి

సారంగపూర్: గంజాయి, సిగరెట్, మద్యం, ఇతర డ్రగ్స్‌కు బానిసలుగా మారితే జీవితాలు చిత్తవుతాయని సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ ఉత్తర తెలంగాణ చైర్మన్ డాక్టర్ సాప పండరి అన్నారు. చించోలి(బి) ఎక్స్‌రోడ్డు సమీపంలోని మైనారిటీ గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థులకు బుధవారం మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలను తీసుకోవడం వలన క్రమేణా ఆరోగ్యం క్షీణించి క్యాన్సర్ బారిన పడతారన్నారు. తద్వారా తల్లిదండ్రులకు కడుపుకోత మిగులుతుందన్నారు. వాటికి దూరంగా ఉండి భవిష్యత్‌ను అందంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జేడబ్ల్యూహెచ్‌ఆర్‌సీ జిల్లా డైరెక్టర్ ఠాగూర్ దత్తూసింగ్, జిల్లా మహిళా విభాగం చైర్మన్ అనూష, మండల చైర్మన్ పోలీస్ భీమేష్, ప్రతినిధులు సంజీవ్, మాటేగాం మాజీ సర్పంచ్ లక్ష్మణరావు పటేల్, కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ అప్ప, పాల్గొన్నారు.

## సరిహద్దులో పోలీసుల నిఘా



వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై శ్యాంపటేల్

వేమనపల్లి: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రాణహిత నది తీరం వెంట పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ వేమనపల్లి పుష్కరఘాట్, రాచర్ల, కళ్లెంపల్లి ఫెర్రీ పాయింట్లను సందర్శించారు. ప్రయాణికుల వివరాలు, ఆధార్‌కార్డు, ఇతర గుర్తింపు కార్డులు తనిఖీ చేసి ఎటు వెళ్తున్నారు, ఏయే సామగ్రి తీసుకెళ్తున్నారని సోదాలు చేశారు. తెలంగాణ–మహారాష్ట్ర రాష్ట్రాలకు ప్రాణహిత నది సరిహద్దుగా ఉంది. గడ్చిరోలి, చంద్రాపూర్, యావత్‌మాల్ జిల్లాల్లో కూడా సరిహద్దులే ఉన్నాయి. ఆదివాసీ ప్రాంతాలు కావడం, పైగా మావోయిస్టు షెల్టర్ జోన్‌గా పేరుంది. ఈ నేపథ్యంలో ఇరు రాష్ట్రాల పోలీసుల సమన్వయంతో నిఘా ముమ్మరం చేశారు.

## బస్సు సౌకర్యం కల్పించాలని మహిళల రాస్తారోకో



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

దస్తురాబాద్: మండలంలోని గోడిసీర్యాలకు బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ గ్రామానికి చెందిన మహిళలు బుధవారం పాండ్వపూర్-కలమడుగు రహదారిపై రాస్తారోకో చేశారు. రేవోజీపేటలో కాంగ్రెస్ కార్యకర్త వివాహ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యేకు విషయం తెలియడంతో వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ ప్రధాన రహదారికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న మా గ్రామానికి జగిత్యాల, ఉట్నూర్ డిపోలకు చెందిన బస్సులు రాకపోవడంతో ప్రైవేటు వాహనాలకు అధికంగా డబ్బులు చెల్లిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నామన్నారు. దీంతోపాటు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు సౌకర్యం కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే ఆర్టీసీ ఆర్‌ఎం, డీఎంతో ఫోన్‌లో మాట్లాడారు. రెండు రోజుల్లో రూటు సర్వే చేసి బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో మహిళలు రాస్తారోకో విరమించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దుర్గం మల్లేశ్, నాయకులు శ్రీనివాస్, మాన్కు, గోపి, సురేందర్, స్వామి, తదితరులు ఉన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి

బెల్లంపల్లి: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున డిమాండ్ చేశారు. బుధవారం బెల్లంపల్లిలో నిర్వహించిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల ఫీజు బకాయిలు రూ.7800 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం స్పందించాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, నాయకులు సావిత్రి, రాహుల్, శేఖర్, మహేందర్, అనిల్, క్రాంతి, ఎంసీపీఐ(యూ) నాయకులు వెంకటేష్, రమేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.